

గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - కడప : పిల్లలు గాలిపటాల ఎగరవేసే సమయంలో వారి వెంట పెద్దలు ఉండి విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు తగలకుండా దూరంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ సూచించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిద్దెలపై నుంచి గాలి పటాలు ఎగురవేసే క్రమంలో విద్యుత్ లైన్లకు దూరంగా ఎగురవేయాలని సూచించారు. ఒకవేళ విద్యుత్ లైనులకు కానీ, ట్రాన్స్‌ఫార్మర్లకు కానీ విద్యుత్ తీగలకు కానీ గాలిపటాలు చిక్కుకుంటే వాటిని వదిలి వేయాలన్నారు. వాటిని తీసుకునే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా స్థల వ్యయం తదితర కారణాలవల్ల తాము ఎంత చెప్పినా ఇంటి నిర్మాణం లైన్లకు దగ్గర్లో చేపడుతున్నారు అన్నారు. కావున విద్యుత్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలని సూచించారు. పిల్లలు లైన్ల లోని విద్యుత్‌ను, వాటి వల కలిగే ప్రమాదాలను గుర్తించలేరని, పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకొని మైదానాలలో గాలిపటాలు ఎగుర వేసుకునేలా విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యురేనియం కాలుష్యం..

రైతన్నలకు శాపం

- నష్టాలలో ఉద్యాన, పాడి రైతులు
- చర్మవ్యాధి బారిన ప్రజలు, పశువులు
- పైపుల లీకేజీతో కలుషితమవుతున్న నీరు
- తూతూ మంత్రంగా మెడికల్ క్యాంపులు
- నియంత్రణ చేయడంలో విఫలమైన అధికారులు



టెయిలింగ్‌పాండ్‌లో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

2007 సంవత్సరంలో పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం తుమ్మలపల్లి , మబ్బు చింతలపల్లి, కె.కె. కొటాల, రాచుకుంటపల్లి, భూమయ్య గారి పల్లి, మీది పెంట గ్రామాలకు సంబంధించిన భూములలో యురేనియం కర్మాగారాన్ని ప్రారంభించారు. యురేనియం వల్ల వచ్చే కాలుష్యం రైతన్నలకు శాపంగా మారింది. యురేనియం పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాల వల్ల ప్రజలు, పశువులు చర్మ వ్యాధి బారిన పడుతున్నారు. వ్యర్థ పదార్థాల వచ్చే పైపులు లీకేజ్ కావడం వల్ల కాలుష్యం ఎక్కువై పంటలపై ప్రభావం చూపి పంటలు పండకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అరటి బాగా సాగు చేస్తారు. అలాగే పాడి పరిశ్రమ కూడా మెండుగా ఉంది, కలుషితమైన నీరు వల్ల పంటలు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా వీటి ప్రభావం పశువుల పైన పడి పాడి రైతులు కూడా నష్టాలలో ఉన్నారు. కొంతమంది రైతులు పంటలు వేయకుండానే వదిలేశారు. వ్యర్థ పదార్థాలు భూమిలోకి ఇంకడం వల్ల నీళ్ల కలుస్తామవుతున్నాయి. తూతూ మంత్రంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మమ అనిపిస్తున్నారు. వీటిని నియంత్రణ చేయడంలో అధికారులు విఫలం కాడంతో 15 ఏళ్లుగా ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. కలుషిత నీటితో పంట దిగుబడులు తగ్గడమే కాకుండా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు యూసిఐఎల్ అధికారులతో పాటు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని రైతులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వేముల మండలం ఎం. తుమ్మలపల్లె వద్ద భారత యురేనియం సంస్థ (యుసిఐఎల్) 2007లో యురేనియం తవ్వకాలతోపాటు శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో పరిసర గ్రామాల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తామన్న హామీ విస్మరించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధులపై భరోసా శూన్యం

యురేనియం నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు భూమిలోనికి ఇంకి నీరు కలుషితం కావడంతో పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలకు పశువులకు చర్మవ్యాధులు వాటిల్లుతున్నాయి. రోగులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్న హామీ ఇచ్చినా కేవలం గ్రామాల్లో నెలకొకసారి మాత్రమే వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ ప్రాంతవైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ ప్రాంత సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదని వారంతా వాపోతున్నారు.

పంట దిగుబడులు తగ్గుముఖం..

ముడి యురేనియాన్ని శుద్ధిచేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను కనం కిందకొట్టాల సమీపంలో నిర్మించిన టెయిల్‌ఫాండ్‌లో నింపుతున్నారు. దీంతో వ్యర్థాలు భూగర్భంలోకి వెళ్లి వ్యవసాయ గొట్టపుబావుల్లోకి చేరి కలుషితమవుతున్నాయి. ఈ నీటిని పంట తడులకు అందిస్తున్నారు. దీంతో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గుతున్నాయి. రైతులు ఆర్థికంగా దెబ్బతినడంతో కొంతమంది రైతులు పంట సాగుచేయకుండా బీడుగా వదిలేశారు. ఈ ప్రాంతంలో అరటి తోటలకు ఈ ప్రాంతం పెట్టిందిపేరు. అలాంటి పల్లెల్లో కలుషిత నీటితో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి.

నిరంతర పర్యవేక్షణ లేకపోవడం

యురేనియం వ్యర్థాల విషయంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసిఐఎల్) పర్యవేక్షణ లోపం వల్ల గత ఫిబ్రవరి నెలలో టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ కావడం కలకలం రేపింది. దాదాపు 12 నుంచి 15గంటల పాటు వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. దీనిని గమనించిన కొందరు రైతులు యూసిఐఎల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. ఆ వ్యర్థాలను పొరపాటున ఎవరైనా తాకితే చర్మం పూర్తిగా ఊడిపోతుందని చెబుతున్నారు. ఇలాంటి ప్రమాదం జరుగుతుందనే ఆందోళనతో ప్రజలు ఉన్నారు. యురేనియం వ్యర్థాలను నిల్వ చేసే టెయిలింగ్ పాండ్‌ను నిరంతరం పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇక్కడ పదేపదే పైప్‌లైన్ లీక్ కావడం పరిపాటిగా మారింది.

గ్రామాలు ఖాళీ అవుతున్నాయి..

యురేనియం కర్మగార పరిసర ప్రాంతాల గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. వ్యర్థ పదార్థాల పైపులు లీకేజీ కావడం వల్ల వాతావరణంతో పాటు భూగర్భ జలాలు కలుషితమై చర్మ వ్యాధులు వస్తుందని పల్లె ప్రజలంతా పట్టణానికి తరలి వెళ్తున్నారు. దీంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి.

- సింగం శెట్టి నాగేంద్ర, రైతు, కెకె.కొట్టాల, వేముల మండలం

నియంత్రణ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

యూనియన్ కర్మాగారం నుంచి వచ్చే వ్యర్థపు నీరు ప్రవహించే పైపుల నియంత్రణ చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఎక్కడో చోట రోజు పైపులు లీకేజీ కావడం వల్ల భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితం కావడంతో సాగునీరు, తాగునీరు కలుషితమవుతున్నాయి. పంటలపై, చుట్టుపక్క గ్రామ ప్రజలపై ప్రభావితం చూపి పంటల నష్టంతో పాటు ప్రజల అనారోగ్య పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత పరిష్కారం కోసం అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- సింగం శెట్టి మోహన్ బాబు రైతు, కె.కె.కొట్టాల, వేముల మండలం

నా పొలాన్ని వదిలేశాను..

యురేనియం పరిసర ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ భూమిని వదిలేశాను. టెయిలింగ్ పాండ్ పైప్ లైన్ లీకేజీలతో భూమి తెలుపు రంగులోకి మారి కలుషితమైంది. ఏ పంట పెట్టినా ఎదుగుదల లేకుండా పోవడమేగాక దిగుబడి రాక నష్టాలొచ్చాయి. దీంతో ఎటువంటి పంటలు పెట్టకుండా వదిలేశాను. యూనియన్ అధికారులు కానీ, ఉన్నతాధికారులు పరిశీలించి తగు నష్టపరిహారం కల్పించాలి.

- మూడే బీమ్లా నాయక్ రైతు, కనంపల్లె

నిత్యం వైద్యశిబిరాలు నిర్వహించాలి

యురేనియం పరిసర ప్రాంతాల గ్రామాలలో నిపుణులైన వైద్యులతో రోజూ వైద్య క్యాంపులు నిర్వహించి, ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించాలి. లేకపోతే యురేనియం బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల తిరుగుబాటులో వచ్చే అవకాశం ఉంటుంది.

- కె.తిరుపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పులివెందుల.



వ్యర్థ పదార్థాలు వెళ్లే పైపు లీకేజీ పనులు (ఫైల్‌ఫోటో)



ఎన్నికైన నూతన కమిటీ

మాలమహానాడు నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కడప అర్బన్

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు కిషోర్ నాయకత్వంలో జిల్లా మాలమహనాడు అధ్యక్షులు చెవుల తిరుపాల్ సారథ్యంలో మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షులు ఎద్దుల వసంత్ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం దువ్వూరు మండలం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ సంఘాన్ని బలోపేతం చేయడమే కాకుండా అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని కొనసాగిస్తామన్నారు. మాలల హక్కుల కోసం పోరాడుతామని చెప్పారు. ఇప్పటికే దళితుల్లో అనైక్యత నెలకొందని తెలిపారు. దళితులు ఐక్యంగా పోరాడుతేనే హక్కులు సాధ్యమన్నారు. ఇందులో భాగంగా దువ్వూరు మండల కమిటీని ఎన్నుకున్నారు. వీరిలో మండల సలహాదారులుగా బి. చెండ్రాయుడు, వై.అజయ్ బాబు, దువ్వూరు మండల మహిళ అధ్యక్షులు సుశీలమ్మ, మండల అధ్యక్షులుగా వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆవుల ఓబులేష్, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షుడు బిర్రు చెన్నయ్య, అధికార ప్రతినిధి మెల్ల రాజేశేఖర్, యూత్ ఉపాధ్యక్షులు రామక్క, సునీల్, కార్యదర్శి మెల్ల ప్రతాప్ పాల్గొన్నారు.



గిరి ప్రదర్శనలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎఎస్‌పి రమణయ్య

వైభవంగా గిరి ప్రదర్శన

ప్రజాశక్తి - వల్లూరు

పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి మహా క్షేత్రంలో శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సట్టి భారవి ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా గిరి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఆర్ ఎఎస్‌పి రమణయ్య హాజరయ్యారు. ముందుగా ఆయన పాదరాయి వద్ద సంకల్పం చేసుకొని గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం కొండపై వెలసిన చెన్నకేశవ స్వామి, సంతాన మల్లేశ్వర స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించిన భారవిని వారి సభ్యులను అభినందించారు. భారవి మాట్లాడుతూ పిలిచిన వెంటనే గిరి ప్రదక్షణకు విచ్చేసిన రమణయ్యకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు హాజరైన వారికి అత్యవసర చికిత్స కోసం కడప డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కొండారెడ్డి, రత్నం, సునీల్, సత్యనారాయణ గాంధీ, కూన ఈశ్వర్ రెడ్డి, వరప్రసాద్, సునందమ్మ, ఈశ్వర్ రెడ్డి, బసిరెడ్డి, ఉదయ్ కుమార్, సుబ్బారెడ్డి, భాస్కర పాల్గొన్నారు.



శిల్పారామంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

సంక్రాంతి సంబరాల సందర్భంగా కడప శిల్పారామంలో సాయంత్రం 6 గంటలకు భోగి మంట వేశారు. అనంతరం సాంస్కృతిక కళావేదిక మీద చిత్తూరు జిల్లా చెందిన బైరెడ్డిపల్లి కళాతరంగని బృందం శాస్త్రీయ నృత్యాలు, సినీ, జానపద గీతాలుకు డాన్సులు వేసిశారు. వారి డాన్స్ లకు ప్రేక్షకులు తమ ఆనందాన్ని, చప్పట్లు తెలియజేశారు. పాటలు: గోదావరి గట్టుమీద, సంక్రాంతి వచ్చింది పాటలు కు డాన్స్ వేశారు. కార్యక్రమాలను శిల్పారాం పరిపాలన అధికారి శివ ప్రసాద్ రెడ్డి, ఫీల్డ్ సూపర్వైజర్ మధుసూదన బాబు పర్యవేక్షించారు.

ఛార్జీలు తగ్గించాలంటూ..

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్



కడప : విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ ఛార్జీలను ఎన్నికల ముందు పెంచబోమని ఇచ్చిన హామీలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా భోగిమంటలలో పెంచిన విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. జిల్లాలో 10 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారని, ప్రతి వినియోగదారుడి మీద సాధారణంగా వచ్చే బిల్లుకు అదనంగా 60 నుంచి 120 శాతం దాకా భారం పడిందన్నారు. విద్యుత్ రంగంలో కీలకమైన మార్పులు తెచ్చి ప్రజల మీద పెద్ద ఎత్తున భారాలు మోపుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల ప్రతి వినియోగదారుడికి రూ.10 వేల నుంచి రూ. 25వేల అదనపు భారం పడబోతుందన్నారు. పీక్ అవర్ డిమాండ్ పేరుతో విద్యుత్ వినియోగాన్ని వినియోగించే కాలాన్ని బట్టి విద్యుత్ యూనిట్ ధర నిర్ణయం జరగబోతుందన్నారు. ఈ పద్ధతి అమలు అయితే విద్యుత్ పుష్కలంగా అందుబాటులో ఉన్న సామాన్య ప్రజానీకం విద్యుత్తును వినియోగించే స్థితి లేకుండా పోతుందన్నారు. విద్యుత్ రంగాన్ని ముక్కలు ముక్కలు చేసి ప్రయివేట్ వ్యక్తులకు ఇప్పటికే అప్పగించేందుకు ప్రయత్నాలు వేగవంతం చేశారన్నారు. రానున్న రోజుల్లో సబ్ స్టేషన్ల వారీగా కాంట్రాక్టుకు ఇచ్చి, కాంట్రాక్టర్లకు నచ్చిన వారికే విద్యుత్ అందుబాటులో ఉండేలా చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యుత్ రంగ సంస్కరణలు సామాన్య ప్రజలకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ ను అందించాలి తప్ప ప్రజానీకం మీద భారాలు వేసేదిగా ఉండకూడదని చెప్పారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, గోవిందు, విజయ్, సరిత పాల్గొన్నారు.

అట్లూరు : ట్రూ అప్, విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు సోమవారం భోగిపండుగ సందర్భంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలియజేశారు. ఈ సందరంగా పార్టీ నాయకులు చాంద్‌బాషా, రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ప్రజలకు ఇచ్చి చెప్పి అధికారంలోకి వచ్చాక రకరకాల ఛార్జీల పేరుతో అధిక భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ. 6073.86 కోట్లు, ఇతర ఛార్జీల పేరుతో రూ. 9412.50 కోట్లు మొత్తం రూ. 1548.536 కోట్లు ప్రజలపై భారం వేసి ప్రజలకు షాక్ ఇచ్చారని తెలిపారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి గద్దెనెక్కి ప్రజల నడ్డి విరుస్తున్నారని చెప్పారు. ఎస్‌టి, ఎస్‌సిలకు గత ప్రభుత్వం 200 యూనిట్లు ఉచితంగా ఇచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు దూరం చేసే ప్రయత్నాల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిఎడల రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కళాకారులు ,అభ్యుదయవాదులు ప్రజలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవిచంద్ర, దుర్గమ్మ, స్వప్న, గురమ్మ, సుభద్ర పాల్గొన్నారు.



అట్లూరు : విద్యుత్ బిల్లులను మంటలో వేసి దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

జమ్మలమడుగు రూరల్ : అదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను వెంటనే తగ్గించాలంటూ రాష్ట్ర, జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను సోమవారం స్థానిక పాతబస్టాండ్‌లో జమ్మలమడుగు పట్టణ సిపిఎం కార్యదర్శి జి. ఏసుదాస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని' అదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడ్డగోలుగా వివిధ రకాల విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని వాపోయారు. ట్రూ ఆఫ్ చార్జీలను 2022, 23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి అదనపు భారాన్ని బిల్లులకు జమ చేయడం సరైంది కాదని మండిపడ్డారు. దీంతో సామాన్యుడు బిల్లులు కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎ. వినయ్ కుమార్, దాసరి విజయ్, రమేష్, రఫీ, బాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

వేంపల్లె : వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలని గత వైసిపి ప్రభుత్వం 2020 సెప్టెంబర్ 1న జారీ చేసిన జీవో 22 పత్రాలను రైతు పండగైనా భోగి పండుగ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి భోగి మంటల్లో వేసి దహనం చేశారు. చేశారు. అలాగే భోగి పండుగను కాంగ్రెస్ నాయకులు ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండుగ కాబట్టి రైతు వ్యతిరేక జీవో నైనా 22 పత్రాలను భోగి మంటల్లో వేసి కాల్చి వేశామని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పండుగ చేసే విధంగా వ్యవసాయ రుణాల మాఫీ, ఉచిత విద్యుత్ సరఫరా, ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా, సున్నా వడ్డీ ,పావలా వడ్డీ రుణాలు, జలయజ్ఞం ఇలా అనేక రైతు అనుకూల విధానాలు అమలు చేసిందని చెప్పారు. కానీ దురదృష్టవశాత్తూ తర్వాత వచ్చిన వైసిపి టిడిపి ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని అమలు చేసిందని తెలిపారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే జీవో 22 ను రద్దు చేస్తామని టిడిపి, జన సేన పార్టీలు హామీ ఇచ్చాయాని చెప్పారు. అధికారంలోకి వచ్చి 7 నెలలైనా జీవో 22 ను రద్దు చేయలేదని అన్నారు. ఇప్పటివరకు రూ 20 రూపాయల ఆర్థిక సాయం కూడా చేయలేదని విమర్శించారు. అందువల్ల రైతుల మూఖాల్లో సంక్రాంతి సంతోషం కనిపించడం లేదని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగ రాజు, వినయ్, బద్రి వెంకటేష్, మహబూబ్ బాషా, సుబ్బరాయుడు, వేమా రాజా, వేమయ్య, మాధురి రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డుపై ప్రమాదకరంగా పడి ఉన్న విద్యుత్ వైరు

తప్పిన విద్యుత్ ప్రమాదం

ప్రజాశక్తి అట్లూరు

మండలంలోని బద్వేల్-ముత్తుకూరు ప్రధాన రహదారిపై కమలకూరు సబ్ స్టేషన్ పరిధిలోని మన్యంవారిపల్లి మలుపు వద్ద 11కెవి వైర్లు రోడ్డుకు అడ్డంగా తెగిపడి మంటలు చెలరేగాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు రోడ్డు మీద మంటలు గుర్తించి ప్రయాణికులను దగ్గరకు రాని వ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఇ స్పందించి సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించారు. సంక్రాంతి పండుగ రోజు పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

ప్రజాశక్తి - కడప

సమాజంలో ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని అంతర్జాతీయ ప్రసంగీకులు డాక్టర్ టి. డి.ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం నగర పరిధిలో 48 డివిజన్ కృపా కాలనీలో పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరాన్ని ప్రసన్నకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ మదన్ మోహన్, డాక్టర్ అభిద్, డాక్టర్ అయేష, డాక్టర్ గోపినాథ్ మహిళా నాయకురాలు విమల, బుడగజంగం పెద్దలు పత్తికొండ కందనాతి, తాడిపత్రి ఎం.సుంకన్న, గుత్తి ఏ.ఈశ్వరయ్య, ఈ నరసప్ప, స్థానిక బుడగజంగం నాయకులు డి.రాజు, డి. శ్రీరాములు, రామయ్య సంఘ పెద్దలు, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.



ప్రార్థన మందిరాన్ని ప్రారంభిస్తున్న టి.డి. ప్రసన్న కుమార్

సాయి ఏజెన్సీని రద్దు చేయాలి

- మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లావ్యాప్తంగా క్లాప్ బండ్లు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపలో నడుస్తున్నాయని, కార్మికులకు రూ.18వేలు ఇవ్వాల్సి ఉండగా, కట్ చేసి రూ .10,500 మాత్రమే ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా విశాఖలో రూ.18 వేలు ఇస్తున్నారని తెలిపారు. కడపలో మాత్రం రూ.13 వేలని చెప్పి కటింగ్‌ల పేరుతో రూ.10,500 మించి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రెడ్డి ఏజెన్సీ, పావని ఏజెన్సీ మీద లేబర్ డిపార్ట్‌మెంట్లో చర్చలు నడుస్తున్నాయని తెలిపారు. సాయి పావని యాజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా తక్కువ వేతనాలు ఇస్తున్న సాయి పావని ఏజెన్సీని రద్దు చేసి కార్పొరేషన్, మున్సిపాలిటీలు నిర్వహించాలని తెలిపారు. జీవో నంబర్ 7 ప్రకారం రూ.24,500 ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజల ద్వారా వసూలు చేస్తున్న టువంటి డబ్బులు ఒక్కొక్క క్లాప్ బండికి దాదాపు రూ.63 వేలు ఇస్తున్నారని తెలిపారు. కానీ డీజిల్, డ్రైవర్ ఇతరుల పేరు మీద రూ. 30 నుంచి రూ.40 వేలు మాత్రం కూడా ఖర్చు పెట్టలేదని పేర్కొన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, సక్రమంగా కట్టలేదని తెలిపారు. వీటన్నిటి పైన విచారణ చేసి సాయి పావని ఏజెన్సీ, రెడ్డి ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేకపోతే ఆందోళన చేస్తామని తెలిపారు. ఏజెన్సీలను రద్దు చేసి మున్సిపాలిటీలు స్వాధీనం చేసుకొని వారే నిర్వహించాలని పేర్కొన్నారు.

సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలు విడుదల చేయడం పట్ల ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా డి. రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడం హర్షణీయమన్నారు. జనవరి 1న రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ కలిసి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై చర్చించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి త్వరలో అన్ని పరిస్కారం చేస్తన్నాని హామీ ఇచ్చారని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.13 వేల కోట్లు విడుదల చేశారని చెప్పారు. ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేసి ప్రభుత్వ పథకాలు వంద శాతం ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం నెరవేరుస్తుందనే ఆశా భావం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా సహ అధ్యక్షులు టి. తిమ్మారెడ్డి, బాల పుల్లయ్య, సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్ రెడ్డి, వాసన్, నాగార్జున, పద్మనాభం, కాటమయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి ఎన్‌జిఒ నాయకులు



విద్యుత్ లైన్‌ను సరిచేస్తున్న సిబ్బంది

విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - వేముల

వేముల నుంచి బచ్చయ్యగారిపల్లె మీదుగా తహశీల్దార్ కార్యాలయం పక్కన నుంచి మీది పెంట్లకు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న 11 కెవి విద్యుత్ లైన్‌ను సోమవారం ఆ శాఖ అధికారులు సరి చేశారు. సోమవారం 'ప్రజాశక్తి'లో 'తెగేందుకు సిద్ధంగా విద్యుత్ తీగ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ.. స్థానిక రైతులు, ప్రజలు 'ప్రజాశక్తి'కి ధన్యవాదాలు తెలిపారు.

అల్లాడుపల్లె ఉత్సవ కమిటీ నియామకం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నియమించారని ఆలయ ఇఒ మారుతి ప్రసాద్ తెలిపారు. ఉత్సవ కమిటీ సంక్రాంతి, మహాశివరాత్రి పండుగల సందర్భంగా నిర్వహించే ఉత్సవాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆలయ పాలక మండలి సభ్యులు నియామకం అయ్యేవరకు ఉత్సవ కమిటీ సభ్యులు దేవాలయాన్ని పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా పెరుగు వీరనారాయణ యాదవ్, ఆర్ వీరారెడ్డి, జిసిసి వీరారెడ్డి, పార్వతి, ఆదిలక్ష్మి, పావని, మహేశ్వర్‌రెడ్డి, గుర్రమ్మ, జగన్నాథ్, శ్రీకళ, నరేంద్ర శర్మ నియమితులయ్యారని ఇఒ వివరించారు.



అన్నం వడ్డిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వీరభద్ర స్వామి ఆలయ ఆవరణలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె దేవళాలు వీరభద్రస్వామి సన్నిధిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. భోగి పండుగ సందర్భంగా వీరభద్ర స్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ మారుతి ప్రసాద్, వీరభద్రస్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు నారాయణ యాదవ్, గోసుల వీరారెడ్డి, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న అగస్టీన్‌రాజు అభిమానులు

పేదల పక్షపాతి డాక్టర్ గేయానంద్

- క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ రాజు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నాస్తికుడు, పేదల పక్షపాతి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తనకు స్ఫూర్తిదాత, మెంటర్ అని క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ రాజు పేర్కొన్నారు. స్థానిక క్యాంబెల్ ఆసుపత్రిలో సోమవారం అగస్టీన్ రాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పాస్టర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అగస్టీన్ రాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు నేర్పిన సంస్కారం తనను ఇలా మీ అందరి ముందు నిలబెట్టిందన్నారు. అనంతపురంలో రూ.5లకే వైద్యం అందిస్తూ ఎంతోమందికి గేయానంద్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన నిరాడంబరత, నిబద్ధత పలువురికి ఆదర్శమన్నారు. క్యాంబెల్ ఆసుపత్రి జిల్లాలోనే ఉన్నతమైన వైద్యం అందిస్తున్న వైద్యశాల అని కొనియాడారు. అగస్టీన్ రాజు సతీమణి మాట్లాడారు. పురప్రజలు, అభిమానులు, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలను సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. భోగి పండుగ రోజు స్థానిక వెజిటబుల్ మార్కెట్ ఎన్ నాగేంద్ర ప్రసాద్ సహకారంతో ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు ఉపేంద్ర తన ప్రదర్శనతో ప్రేక్షకులకు ఎంతగానో ఆకట్టుకున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్‌లో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కూరగాయల నాగేంద్ర ప్రసాద్, పరిపాలన అధికారి బి.సుధాకర్, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రైం కార్నర్

నగలు స్వాధీనం, వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మొర్రాయపల్లి రోడ్డు వద్ద సోమవారం కోపెర్ల ప్రసన్నకుమార్ అనే వ్యక్తి వద్ద రూ.2 లక్షల విలువచేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుకు సంబంధించి ఎస్ఐ చిన్న పెద్దయ్య ఉత్తర్వులు మేరకు నిందితున్ని పట్టుకున్నామన్నారు. అతని వద్ద నుంచి బంగారు నగలు స్వాధీనం చేసుకొని మైదుకూరు కోర్టులో హాజరుపరచామని ఆయన తెలిపారు.



నిందితుడితో ఎఎస్ఐ నాగేంద్రప్రసాద్

ఎన్‌టిఆర్ శుద్ధి నీటి పేరుతో దందా

ధర పెంచి సొమ్ము చేసుకుంటున్న నిర్వాహకుడు-నిమ్మకునీరెత్తినట్లు అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలో పేద ప్రజలందరికి మినరల్ వాటర్ ఇవ్వాలనే ఉద్దేశంతో గతంలో చంద్రబాబు పాలనలో వేంపల్లెలోని తిరుమల థియేటర్ సమీపంలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పేరుతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి వైసిపి పాలన కూడా వేంపల్లె ప్రజలకు సరసమైన ధరకే శుద్ధి జల నీరు లభించేది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరుమల థియేటర్ సమీపంలో ఉన్న ఎన్‌టిఆర్ సుజల స్రవంతి నీటి శుద్ధి మినరల్ వాటర్ ప్లాంట్‌ను వైసిపి నేతల నుంచి టిడిపి నేతలు హస్తగతం చేసుకున్నారు. టిడిపి అధినేతలు పార్టీ కోసం పని చేసిన వ్యక్తులకు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉండగా.. స్థానిక టిడిపి నేతల ఆదేశాల మేరకు పార్టీ కోసం సోషియల్ మీడియాలో చురుకుగా పని చేసిన వ్యక్తికి ఎన్‌టిఆర్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను అప్పగించారు. సదరు వ్యక్తి మరో వ్యక్తికి ధారాదత్తం చేశారు. ఆ వ్యక్తి శుద్ధి నీటి పేరుతో ధరను పెంచి నీటి దందా మొదలెట్టారు. వేంపల్లె గ్రామంలో ప్రయివేటు వ్యక్తులు కూడా మంచి నీటి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. అయితే ప్రయివేటు నీటి శుద్ధి వ్యాపారులు ధరను పెంచి నీటిని విక్రయాలు చేస్తున్నారు. గతంలో రూ.10కే కూల్ వాటర్ ఎన్‌టిఆర్ మినరల్ వాటర్ ప్లాంట్‌లో ప్రజలకు అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ అధీనంలో పని చేస్తున్న ఎన్‌టిఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు కూడా ప్రయివేటు వ్యక్తుల్లాగా కూల్ వాటర్‌ను రూ.15కు పెంచి విక్రయాలు సాగిస్తున్నాడు. ప్రజలకు శుద్ధి నీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన దీన్ని ప్రస్తుతం ఉన్న నిర్వాహకుడు నీటి దందాకు తెరలేపడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌ను వ్యాపార కేంద్రంగా మలుచుకున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో ప్లాంట్ సమీపంలోనే గ్రామ పంచాయతీ తరుపున ప్రజలకు నీటిని అందివ్వాలని బోరు వేశారు. ఇక్కడ ఎన్‌టిఆర్ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో ఆ బోరు నీటిని మినరల్ వాటర్ ప్లాంట్‌కు అనుసంధానం చేశారు. ప్రస్తుతం బోరుకు వస్తున్న కరెంటు బిల్లును కూడా పంచాయతీ అధికారులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రజలకు తక్కువ ధరకు శుద్ధి నీటిని అందించాల్సిదిపోయి అధిక ధరకు విక్రయిస్తూ తమ జేబులు నింపుకొంటున్నారు. ఎన్‌టిఆర్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు ఇష్టం వచ్చినట్లు బోర్డులు పెట్టి అధిక ధరలకు శుద్ధి నీటిని విక్రయాలు చేస్తున్నాడు. నామ



మాత్రపు ధరను పెట్టి ప్రజలకు శుద్ధి నీటిని అందించాలన్న లక్ష్యంతో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పేరుతో ఉచిత వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వేంపల్లెలో మాత్రం టిడిపి పార్టీ ఆ లక్ష్యాన్ని నీరు గార్చుతోంది. అటువైపు వెళుతున్న ప్రజలు, ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వాటర్ బాటిళ్లతో నీరు తాగేందుకు వస్తే నిర్వాహకుడు పిల్లలు అని కూడా చూడకుండా వాటర్ బాటిళ్లకు డబ్బు వసూలు చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. గ్లాస్ నీటిని కూడా అమ్ముకుంటున్నారు. నీటి వ్యాపారం చేసే ప్రయివేటు వ్యక్తులే పాదచారులు దాహం తీర్చు కునేందుకు ప్లాంట్ వద్దకు వెళ్లితే నీటి దప్పిక తీర్చుతున్నారు. ఉచితంగా నీళ్లు తాగడానికి ఇదేమైనా మీ సొమ్మునా, కరెంటు బిల్లు మీరు కడుతున్నారా అంటూ నిర్వాహకుడు కసురు కుంటున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఎమైనా చెబితే ఈ ప్లాంట్‌ను తాను డబ్బులు పెట్టి బిగించుకున్నాను అని గద మాయిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. ఈ వాటర్ ప్లాంట్ వద్ద గతంలో ఎంతో మంది పిల్లలు, పెద్దలు బాటిళ్లతో నీటిని పట్టుకొంటున్నా ఎవరూ అడ్డు చెప్పేవారు కాదు. ప్రస్తుత వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు టిడిపి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నట్లు పలువురు టిడిపి నేతలు వాపోతున్నారు. సాకులు చెప్పి నీటిని అధిక ధరలకు పెంచారని పేర్కొంటున్నారు. ధర పెంచడంపై అధికారులు మౌనం వహిస్తుండడంతో నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌పై టిడిపి నేతలు ప్రత్యేకదృష్టి పెట్టి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో మున్సిపల్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులు సోమవారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. నాయకులు, కార్మికులు భోగి మంటలు వేసి సాంప్రదాయ దుస్తులు ధరించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఒ చంద్రశేఖర్ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పుడు విధులే కాకుండా పండుగ సందర్భంగా ఆటలు పాటలు ఉండాలని చెప్పారు. ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ మాట్లాడుతూ భోగి పండుగ పర్యావరానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా జరిపే విధంగా కార్మికులచే నిర్వహించామన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేయడం వల్ల కార్మికుల్లో నూతన ఉత్తేజం, సమాన భావన కలుగుతుందని తెలిపారు. నగర కమిటీ అధ్యక్షులు రవి మాట్లాడుతూ మున్సిపల్ యూనియన్ అంటే ధర్నాలు, నిరాహార దీక్షలు, ఆందోళనలు కాదని చెప్పారు. ఇటువంటి ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, మేయర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.0 కార్యక్రమనికి సహకరించిన మిత్రులు, శ్రేయోభిలాషులకు, కార్మికులకు ముఖ్య నాయకత్వ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుంకర కిరణ్, దాసు, పెంచలయ్య, వడ్లపల్లి శ్రీధర్ బాబు, ఇత్తడి ప్రకాష్ ,ఆసిబాబు, ధరణి, ఉమా, నాగరాజు, శ్రీరాము, ఓబులేసు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

మూడురోజుల సంక్రాంతి పండుగ తెలుగు ప్రజల ఆత్మీయతలు, అనురాగాలకు ప్రతీకలని, దేశంలో అతిపెద్ద పండుగ సంక్రాంతి అని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. నందమూరి తారకరామారావు తెలుగు ప్రజల ఆత్మీయతలకు భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగను పల్లెప్రజలు సుఖశాంతులతో నిర్వహిస్తారని చెప్పే వారన్నారు. రైతులు, రైతు కూలీలు పాడి పంటలతో శ్రమకోర్చి పండించిన పంటలు ధ్యాన్యరాసులు వాకిళ్ళ ముంగిట పోసి పండుగను ఇంటిల్లిపాది సంతోషంగా నిర్వహించుకుంటారన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నందమూరి తారకరామారావు విగ్రహానికి మాజీ సైనికులు దుర్గ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి ఘనంగా నివాలర్పిస్తూ కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, చీకటి చార్లెస్, జయశేఖర్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, కాటారి స్వర్ణలత పాల్గొన్నారు.

కడప సిటీ : పండుగలు, పర్వదినాలు, మన ప్రాచీన భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలకు, ప్రతీకగా నిలుస్తాయని బిసి సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని విజయదుర్గ కాలనీలో సంక్రాంతి సంబరాలలో భాగంగా సోమవారం ఆనందోత్సవాల మధ్య భోగి మంటలు వేసి ఒకరికొకరు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో పెండ్లిమర్రి మండలం మాజీ మండలాధ్యక్షులు కొరముట్ల వెంకట లక్ష్మమ్మ, బిసి సంక్షేమ సంఘం యూత్ జిల్లా అధ్యక్షులు సిఆర్ఐ సునీల్ జయంత్, విజయ దుర్గ కాలనీ మహిళా అధ్యక్షురాలు గోవిందు సుబ్బమ్మ, ప్రముఖ కాంట్రాక్టర్లు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : తెలుగు వారికి పెద్ద పండుగల్లో సంక్రాంతి ఒకటి. మూడు రోజులు సంప్రదాయంగా సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహిస్తారు. భోగి సందర్భంగా సోమవారం ముంగిళ్ల ముందు ముగ్గులు, భోగి మంటలతో సందడి నెలకొంది. వేకువజామునే పిల్లలు, పెద్దలు, మహిళలు తమ ఇళ్ల ముందు భోగి మంటల్లో ఇంట్లోని పాత సామాన్లు మంటల్లో



పులివెందుల టౌన్ : భోగి మంటలు వేస్తున్న మహిళలు

వేశారు. ఇంటి ముందు గొబ్బెమ్మలతో సంప్రదాయాన్ని కొనసా గించారు. భోగి మంటల చుట్టూ ఆడుతూపాడుతూ సంబరాలు చేసుకున్నారు.

వేంపల్లె : వేంపల్లి మండలం వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సంబరాలు ప్రారంభమయ్యాయి. సోమవారం భోగి సందర్భంగా ప్రజలు తెల్లవారుజాము నుంచే భోగి మంటలు వేసి తమ ఆనందాన్ని చాటుకున్నారు. పిల్లలకు రేగిపండ్లు తలపై పెట్టి స్నానాలు చేయించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు తమ ముంగిట ముత్యాల ముగ్గులు వేయడంతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ధనుర్మాసం సందర్భంగా మహిళలు, భక్తులు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

వెదురూరులో రేపు బండలాగుడు పోటీలు

చాపాడు : సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని వెదురూరులో పార్వతీదేవి సమేత సంగమేశ్వర దేవస్థాన ఆవరణలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. విజేతగా నిలిచిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతిగా రూ.1,00,116, రెండవ బహుమతిగా రూ.70,116, 3వ బహుమతిగా రూ.40,116, నాలుగో బహుమతిగా రూ.20,116, 5వ బహుమతిగా రూ.10116 అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పొంగుతున్న మురుగు.. దుర్వాసనతో జనం అవస్థలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

డ్రయినేజీ కాలువల నుంచి మురుగు పొంగి పొర్లుతోంది. దీని నుంచి వచ్చే దుర్వాసనను భరించలేక జనం అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డు న్యూరో కిడ్స్ పాఠశాల సమీపంలో మ్యానువల్ నుంచి మురుగు పొంగి రోడ్లపైకి వస్తోంది. వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి పండుగ కావడం.. ఇంటి ముందు మురుగు నీరు ప్రవహిస్తుండంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బ్రాహ్మణపల్లి, నారాయణ కాలేజీ వెళ్లే రహదారి కావడంతో రద్దీగా ఉంటుంది. ఈ పరిసరాల్లో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు హడలిపోతున్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా, ప్రయాణికుల సౌకర్యార్థం సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రబీ సాగుపై పగబట్టిన మేఘాలు

ప్రజాశక్తి పులివెందుల టౌన్

రబీ సాగుపై మేఘాలు పగబట్టాయని చెప్పవచ్చు. ఈ ఏడాది రబీ చేసినప్పటి నుంచి మూడు సార్లు తుఫాను రావడం చూస్తుంటే రైతులకు కష్టకాలమే అని చెప్పవచ్చు. మేఘాలు కమ్ముకుండడం, చినుకు జల్లులు పడుతుండడంతో శనగ, దనియా, నువ్వుల పంటలకు పూతలు రాలాయి. తుఫాను కారణంగా కొద్దిపాటి వర్షం పడడం వల్ల పప్పు శనగ, నువ్వు పైరును విపరీతమైన తెగుళ్లు ఆశించాయి. నివారణకు పలు రకాల పురుగు మందులు పిచికారి చేసినా అదుపుకాలేదని రైతులు వాపోతున్నారు. పులివెందుల నియోజకవర్గంలో లింగాల, సింహాద్రిపురం మండలాల్లో అధికంగా శనగ పంటను సాగు చేశారు. వేముల మండలంలో నువ్వు పంటను సాగు చేశారు. తొండూరు, పులివెందుల మండలాల్లో కుర్ర, జొన్న, కంది పంటలను సాగు చేశారు. రెండేళ్లుగా రబీ సీజన్‌లో రైతులకు ఆశించిన దిగుబడి రాలేదు. లాభాలు రాకున్నా పెట్టుబడి ఆయనా వస్తుందన్న సమయంలో మరోమారు మేఘాలు ఆకాశాన్ని కమ్ముకుంటున్నాయి. రైతన్న ఆశలు అడియాసలు అవుతున్నాయి. మేఘాలు తుఫానుగా మారి వర్షం కురిస్తే పూర్తిగా పంట నాశనం అవుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట చేతికి వస్తుందా.. రాదా అనే అపనమ్మకం రైతుల్లో నెలకొంది.



రబీలో సాగు చేసిన శనగ పంట



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవం.. శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసంలో భాగంగా శ్రీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇఒ విశ్వనాథరెడ్డి, అర్చకులు అచ్యుత్ నారాయణాచార్యుల నేతృత్వంలో భక్తుల సహకారంతో సోమవారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. మహిళలు కోలాటం ఆడారు. బచ్చు వెంకట సుబ్బారావు, కదిరేపల్లి ప్రసాద్‌రెడ్డి, భవనాసి రామ్మోహన్‌రెడ్డి, సోమా శంకర్‌రెడ్డి దంపతుల సహకారంతో కల్యాణోత్సవం నిర్వహించారు.

దరఖాస్తుకు గడువు పెంచాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లాలో వివిధ కార్పొరేషన్ల కింద లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయడానికి ఈనెల 8న బిసి సేవా సహకార సంస్థ విడుదల చేసిన ప్రకటనలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించాలని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ కార్పొరేషన్లకు చెందిన లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోమని అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారని, అయితే ఈనెల 12వ తేదీ వరకు కూడా సంబంధిత వెబ్‌సైట్ అందుబాటులో లేదని తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లాలో ఇప్పటివరకు ఎవరు దరఖాస్తు చేసుకోలేదన్నారు. అంతేకాక వివిధ కులాలకు చెందిన అభ్యర్థులకు వారి కుల సర్టిఫికెట్‌ను పొందుటకు 5 రోజులపాటు సెలవులు వచ్చాయన్నారు. వీటన్నింటిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పెంచాలని ఆయన కోరారు. జిల్లాలో బ్రాహ్మణ కార్పొరేషన్ కింద కేవలం 9 యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో ఇచ్చారని, జిల్లాలో బ్రాహ్మణ అభ్యర్థుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ సంఖ్యను కూడా పెంచాలని ప్రసాదరావు కోరారు.



గోల్డ్ విన్నర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జంప్ రోప్ గోల్డ్ విన్నర్‌కు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి తప్పెట్ల వీర హరీష్ ఇండో-నేపాల్ జంప్ రోప్ ఛాంపియన్ షిప్-2025(సౌత్ ఏషియా)లో గోల్డ్ మెడల్ విన్నర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గోశెట్టి రామ్మోహన్ ఆధ్వర్యంలో సోమవారం బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి జాతీయస్థాయిలో రాణించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని క్రీడా పోటీల్లో తమ విద్యార్థి రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మిగిలిన విద్యార్థులు హరీష్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పీడీ వినోనియా రాణి, నాయకులు వై.వెంకటసుబ్బయ్య, బికె సురేష్, రవి ప్రకాష్, రవీంద్రారెడ్డి, ఆనంద రావు, ఉపాధ్యాయులు మునెయ్య, శ్రీనివాసులు, స్వర్ణలత, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు రద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. తన స్వగృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.61కోట్లతో కూర గాయల మార్కెట్ ఆధునీకరణ పనులు మొదలు పెట్టామన్నారు. దాదాపు రూ.20కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఆ పనులను మున్సిపల్ నిధులతో నిర్మించుకోవాలని ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఉత్తర్వుల సారాం శమన్నారు. ఇది అన్యాయమన్నారు. పట్టణంలో కాల్వల ఆధునీకరణ కోసం రూ.160కోట్లు, తాగునీటికి పైప్‌లైన్ కోసం రూ.160కోట్లు పనులు మొదలు పెట్టి 5శాతం పనులు చేశామన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ప్రొద్దుటూరు ప్రజల సౌకర్యం కోసం ఒప్పించి ఈ పనులను మంజూరు చేయించామని తెలిపారు. 20శాతం కన్న తక్కువ పనులు జరిగాయని ఈ పనులను కూడా కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి ముఖ్యమంత్రిని ఒప్పించి మళ్లీ ఈ పనులను ప్రజలపై భారం మోపకుండా కొనసాగించాలన్నారు. ముందుగా ఆప్కాబ్ మాజీ ఛైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ రాణి రాచమల్లుకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



రాచమల్లుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మల్లెల ఝాన్సీ

నమ్మకాన్ని నిలబెట్టుకంటా : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి వైసిపి జిల్లా ఉపాధ్యక్షునిగా నియమించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఎంపీ అవినాష్‌రెడ్డికి, జిల్లా వైసిపి అధ్యక్షుడు రవీంద్రారెడ్డికి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ ప్రదమ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : కడప

E.P. No.79 / 2023 IN
O.S.No. 1022 / 2020

Shaik Abdul Rasheed, Ex-Service Man, S/o. Late Shaik Abdul Rahiman Sab, residing at D. No. 57/9-2, Santhi Nagar, Akkayapalli, Kadapa, YSR District. ...D.Hr./Petitioner/Plaintiff

Vs

1) Shaik Habeeboor Rahiman, S/o Shaik Allah Bakash,
2)Shaik Parveen,W/o. ShaikHabeeboor Rahiman,
Both are R/o. # 57/2, Santhi Nagar, Akkayapalli, Kadapa, YSR District.

...J.Drs/Respondents/Defendants

వేలం ప్రకటన

పై దావాలో ప్రతివాదులకు చెందిన 1) 4.5 x 2.5x16 Almarah (బీరువా) Rs.800/- అంచనా విలువగల, 2) 6.5x2: 10×16 Almarah (బీరువా) Rs.1,200/- అంచనా విలువగల, రెండు బీరువాలను పై కోర్టు వారు, కోర్టు నందు 30.01.2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు వేలము వేయుదురు. వేలము నందు పలుగొనదలచిన వారు ఆధార్ కార్డుతో హాజరై 30.01.2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు వేలము నందు పాలుగొనవచ్చును.

తేదీ : 30.01.2025.

//By Order of the Court//

బి.భాస్కర్
వాది తరపు అడ్వకేట్,
కడప.

రాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కడప వారి కోర్టులో

E.P.No. 331/2023
O.S.No. 281/2022

ఇరగం బాలసిద్ధారెడ్డి ...D.Hr./వాది

Vs

వేదాల లక్ష్మినసింహ్మారెడ్డిచార్యులు ...J.Dr./ప్రతివాది

పై E.P.లో J.Dr.కు పత్రికా ముఖముగా
U/021 R34 CPC నోటీసు

To
వేదాల లక్ష్మీనరసింహ్మాచార్యులు, S/o వి.నాగరాచార్యులు, R/at బెల్లంమండి వీధి, కడప నగరం-516001.

అను మీ మీద, D.Hr. E.P. షెడ్యూలు ఆస్థిని తన పేర రిజిష్టరు చేయించమని డిక్రీ తేది: 06.07.2023 రీత్యా పై E.P. ని సలిపియున్నారు. సదరు E.P. మీ యొక్క హాజరుకు గాను 22.01.2025వ తేదీ వాయిదా వున్నది. కావున సదరు 22.01.2025 తేది ఉ.గం.10.30 ని॥లకు రాజశ్రీ పై కోర్టు నందు హాజరై, పై E.P.లో మీకు ఏమైనా ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట పై E.P.ని మీ పరోక్షముగా తీర్మానించెదరు.

షెడ్యూలు

వైఎస్ఆర్ కడప జిల్లా, కడప రూరల్ సబ్ డివిజన్, సి.కె.దిన్నె మండలం, మామిళ్ళపల్లె గ్రామ పొలం, కడప నగర మున్సిపల్ కార్పోరేషన్‌లోని, ప్లాట్ నెం.14
స.నెం. డి.నెం.604/1- A/c 0.09 సెంట్లు, స.నెం.డి.నెం. 605 - A/c.0.023/4 సెంట్లు, మొత్తము A/c.0.11 3/4 సెంట్లు లేక 568.7 స్క్వేర్ యార్డ్స్ స్థలము.

తేదీ: 13.01.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఎమ్.సుధాకర్ బాబ్జీ
D.Hr. వకీలు, కడప.